క్లుప్తంగా

నిత్యావసర సరుకులను పంపిణీ చేయండి

కలకడ : మండలంలోని అన్ని ప్రభుత్వ చౌకదు కాణాల పరిధిలో నిత్యావసర సరుకులను ఎండీయూ ఆపరేటర్లు ఇంటివద్దనే అందజేయాలని సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ కృపావతి సూచించారు ఎన్నిలక నిబంధనల మేరకు 13వ తేదీ శెలవు తీసుకున్నా అనేక మంది బియ్యం కార్డు దారులు నిత్యావసర సరుకుల కోసం వేచి చూస్తున్నారని, వెంటనే ఎండీయూ ఆపరేటర్లు అన్ని గ్రామాలలో పర్యటించి కార్డు దారులకు సరుకులు అందజేయాలని ఆదేశించారు.

అభయాంజనేయస్వామికి అభిషేకం



విశేష అలంకరణలో స్వామివారు

వాల్మీకిపురం : పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, తోమాలసేవ, ఆకుపూజ, వడమాల పూజ, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త ఇందిరమ్మ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మి నరసింహస్వామి

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం లోని శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సాల్లో భాగంగా మంగళవారం స్వామి హనుమంత వాహనంపై ఊరేగారు. తండాయి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాసవీ జయంతి మహోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, సాయంత్రం వాసవీ సహస్రనామ పారాయణం, వాసవీమాత జీవిత గీతం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ప్రాకారోత్సవం, మహామంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారికి రక్తదానం



రక్తదానం చేస్తున్న అనిల్ కుమార్

పెద్దతిప్పసముద్రం : బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారి పాపకు రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు అనిల్‌కుమార్ ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేసినట్లు సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలను మంగళవారం రాత్రి తొగటవీర క్షత్రియ సంఘం వారిచే అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటల నుంచి జ్యోతులను తయారు చేశారు. ఈ జ్యోతులను శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని రాత్రి 9 గంటల నుంచి సింహ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించనున్నారు. అలాగే అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం చేయనున్నారు. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తొగట వీర క్షత్రియ సంఘం కుటుంబసభ్యులు, భక్తాదులు వేలాదిగా పాల్గొన్నారు.

ఇదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్క..!



వలసపల్లెలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ముదివేడులో ఓటు కోసం రాత్రి వేళ కూడా క్యూకట్టిన ఓటర్లు

- నియోజకవర్గంలో 75.11 శాతం పోలింగ్
- గ్రామాల్లో పెరిగిన ఓటింగ్
- మహిళలతో పోలిస్తే పురుషుల్లో పెరిగిన పోలింగ్ శాతం

మండలాల వారీగా వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
మదనపల్లె	85,726	67,234	78.42
నిమ్మనపల్లె	26,069	22,125	84.87
రామసముద్రం	39,360	32,929	83.66
మదనపల్లె అర్బన్	1,15,435	77,969	67.54
	2,66,590	2,00,247	75.11

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలు 2024 కు సంబంధించి మదనపల్లె నియోజకవర్గంలో ఓట్ల లెక్క తేలింది. ఎన్నికల అధికారుల నుంచి అందిన పూర్తి సమాచారం మేరకు నియోజకవర్గంలో 75.11 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 73.42 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 1.69 శాతం పెరిగింది. అత్యధికంగా నిమ్మనపల్లె మండలంలో 84.87 శాతం, రామసముద్రం మండలంలో 84 శాతం, మదనపల్లె పట్టణంలో 67.54 శాతం, మండలంలో 78.42 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం ఓటర్లలో 75.47 శాతం పురుషులు 74.77 శాతం మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వెల్లడైంది.

మదనపల్లె నియోజకవర్గంలో..

మదనపల్లె నియోజకవర్గంలో 2019కు 2,46,132 ఓటర్లు ఉండగా, 2024కు 2,66,590 మంది ఉన్నారు. ఐదేళ్లలో 20,458 మంది ఓటర్లు పెరిగారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 2,46,132 ఓట్లు ఉండగా 1,80,760 ఓట్లు అంటే 73.42 శాతం పడ్డాయి. ఈ సారి నియోజకవర్గంలో 2,66,590 మంది ఓటర్లు ఉండగా 2,00,247 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీనిశాతం 75.11 అంటే ఈసారి 1.69 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో ప్రస్తుత ఎన్నికల్లో 1,30,461 మంది పురుషులు ఉంటే వారిలో 98,471మంది ఓట్లు వేశారు. 1,36,078 మంది మహిళలు ఉంటే 1,01,755 మంది ఓట్లు వేశారు. ఇతరులు 51 మంది ఉండగా 21 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

రికార్డు స్థాయిలో ఓటింగ్ :

మదనపల్లె నియోజకవర్గంలో నిమ్మనపల్లె మండలంలో రికార్డు స్థాయిలో ఓటింగ్ జరిగింది. నియోజకవర్గంలోని నిమ్మనపల్లె, మదనపల్లె మండలం, మున్సిపాలిటీతో పోలిస్తే ఎక్కడా లేనివిధంగా 84.87 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని ఓటర్ల సంఖ్య 26,069 కాగా మగవాళ్లు 11,006 ఆడవాళ్లు 11,117, ఇతరులు 2.. మొత్తం 22,125 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో కేవలం 67.54 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.

కురబలకోటలో అర్థ రాత్రి వరకు పోలింగ్

కురబలకోట : మండలంలోని ముదివేడు ఉర్దూ స్కూల్, ముదివేడు జెడ్పీ హైస్కూల్, కురబలకోట జెడ్పీ హైస్కూల్, పూజారివారిపల్లె, ఎర్రమద్దివారిపల్లె, నందిరెడ్డిగారిపల్లె పోలింగ్ కేంద్రాల్లో అర్థరాత్రి వరకు కూడా పోలింగ్ కొనసాగింది. సమయం ముగిసినా ఓటర్లు బారులు తీరి ఉండడంతో పోలింగ్ కొనసాగించకతప్పలేదు. ఇక్కడ పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంల ప్రాసెసింగ్ ఆలస్యంగా సాగింది. ఆపై ఉదయం నుండి రద్దీ కొనసాగడంతో సాయంత్రం ఎక్కువ మంది ఓటర్లు ఒక్కసారిగా తరలి వచ్చారు. దీంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యం అయ్యింది. ఇంకో వైపు ఓటు వేయడంలో పెద్ద తరం వారికి వృద్ధులకు ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన లోపం వల్ల కూడా పోలింగ్ ఆలస్యం కావడానికి కారణంగా చెబుతున్నారు. మరో వైపు సాయంత్రం ఉన్నట్టుండి వర్షం పడటం వల్ల కూడా జాప్యానికి కారణాలుగా ఉన్నాయి. ఆ తర్వాత ఈవీఎంలను అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. మండలంలో 83.61 శాతం పోలింగ్ అయినట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు.

కురబలకోటలో 83.61 శాతం పోలింగ్

కురబలకోట : సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 83.61 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో అత్యధికంగా పిచ్చలవాండ్లపల్లె గ్రామం లక్కసముద్రంలోని 202 పోలింగ్ బూత్‌లో 94 శాతం ఓట్లతో మండలంలోనే టాప్‌గా నిలచింది. ఆతర్వాత కొండతూర్పు సిద్దారెడ్డిగారిపల్లెలో 213 బూత్‌లో 93 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలోనే తక్కువగా అంగళ్లలోని 236 బూత్‌లో 68.73 శాతం ఓట్లు పోలయ్యాయి. ముదివేడు కస్పాలో బూత్ నెంబరు 212లో మండలంలోనే అత్యధికంగా 1396 ఓట్లు ఉండగా 1167 ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా కురబలకోటలో బూత్ నెంబరు 214లో అతి తక్కువుగా 447 ఓట్లు ఉండగా 401 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 35,092 మంది ఓటర్లు ఉండగా 29,342 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

పీలేరు నియోజకవర్గంలో 81.09 శాతం పోలింగ్

పీలేరు : పీలేరు నియోజకవర్గంలో 81.09 శాతం ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ తెలిపారు. సోమవారం అర్థరాత్రి వరకు జరిగిన పోలింగ్ బూతులలో మండలాలవారి గుర్రంకొండ మండలంలో 34,777కు గాను 29,646ఓట్లు పోల్ కావడంతో 85.25శాతం, కలకడ మండలంలో 27,913కు గాను 23,666ఓట్లు 87.33శాతం, కెవిపల్లె మండలంలో 31,910ఓట్లుకు గాను 26,724ఓట్లు 89.29 శాతం, వాల్మీకిపురంలో 36,533 ఓట్లుకు గాను30,579ఓట్లు 83.70 శాతం, కలికిరి మండలంలో 40,686ఓట్లుకు గాను 32,261ఓట్లు 79.29 శాతం, పీలేరు లో 62,789 ఓట్లుకు గాను 47,358 ఓట్లు75.42 శాతం ఓట్లు పోలు అయినట్లు తెలిపారు. సరాసరిన పీలేరు నియోజకవర్గంలో 2,34,608 ఓట్లుకు గాను 1,90,234 ఓటర్లు మాత్రం వారి ఓటు హక్కును వినియోగించుకుని 81.09 శాతం మంది ఓటర్లు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రజా ఆశీర్వాదంతోనే విజయం తథ్యం

- సంక్షేమ పథకాలే పార్టీని విజయ పథంలో నడిపిస్తుంది
- పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ప్రజల ఆశీర్వాదంతో 2024లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరవేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ సంక్షేమ పథకాలే పార్టీని విజయపథంలో నడిపిస్తాయన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని, జూన్ 4న మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీగా గెలవడం తథ్యమన్నారు. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

స్ట్రాంగ్ రూమ్‌కు తరలిన ఈవీఎంలు



ఈవీఎం యంత్రాల లోడింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్వో హరిప్రసాద్, ఏఆర్వో రమాదేవి తదితరులు



అంగళ్లు మిట్స్ కళాశాల నుంచి కంటైనర్లలో రాయచోటికి తరలుతున్న ఈవీఎంలు

మదనపల్లె : ఎన్నికలకు ఉపయోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు మంగళవారం మధ్యాహ్నం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రారంభమైన ఎన్నికల సామగ్రి స్వీకరణ మంగళవారం తెల్లవారు జామువరకు జరిగింది. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మదనపల్లె నియోజకవర్గంలోని 260 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎం, వీవీ ప్యాట్ మెషీన్లను సీరియల్ నెంబర్ల ప్రకారం వరుస క్రమంలో తీసుకుని, విధి నిర్వహణకు సంబంధించి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత గట్టి పోలీస్ బందోబస్తు నడుమ వాటిని ఆర్టీసీ డీజీటీ, ఐదు ట్రక్కుల్లో రాయచోటికి తరలించారు. ఈవీఎంలు తీసుకెళుతున్న వాహనాలతో పాటుగా ఆర్వో హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవిలు రాయచోటికి వెళ్లారు. ఈవీఎం వాహనాలకు సెక్యూరిటీగా వన్‌టౌన్ సీఐ వలీబాషు, రూరల్ సీఐ ఎస్.శేఖర్, కేంద్ర ఎస్ఎస్‌బీ సైనికులు వెళ్లారు.

అభ్యర్థుల భవితవ్యం భద్రంగా తరలింపు

కురబలకోట : తంబళ్లపల్లె నియోజక వర్గానికి సంబంధించి అంగళ్లు మిట్స్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలను మంగళవారం జిల్లా కేంద్రం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. నాల్గు కంటైనర్లలో కట్టుదిట్టమైన భద్రత నడుమ రాజకీయ నాయకుల సమక్షంలో వాహనాలకు సీలు వేసి వీటిని తరలించారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని భద్రంగా రాయచోటికి తరలించి అధికార, పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

వైఎస్సార్ సీపీకే ప్రజల దీవెనలు

- గెలుపు ఖాయమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- భారీ మెజారిటీతో గెలుస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ధీమా
- ఓటింగ్ ప్రక్రియ విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె : రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ప్రజల దీవెనలు ఉన్నాయని, తమ పార్టీ గెలుపు ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డిని కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. గెలుపు మనదేనని, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ ... ఐదేళ్లలో సీఎం జగన్ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలతో పాటు పేదలందరి అభివృద్ధి, మహిళల సాధికారత కోసం పాటుపడ్డారని తెలిపారు. అందుకే సీఎం జగన్‌కు అట్టడుగువర్గాలు అండగా నిలిచి ఓటింగ్‌కు పెద్ద ఎత్తున వచ్చి అభిమానాన్ని చాటుకున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తనను ఆదరించి, అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని తెలియజేశారు. రెండునెలలుగా ఎన్నికల ప్రచారంలో తన వెంట ఉంటూ, వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నివేళల తనకు అండదండలందించిన అభిమానులు, కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రాజంపేట పార్లమెంట్ ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడం, మదనపల్లెలో మూడోసారి వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ... ఓటింగ్‌కు మహిళలు, వృద్ధులు, గ్రామీణులు అధికసంఖ్యలో పాల్గొనడం వైఎస్సార్ సీపీ విజయాన్ని డిసైడ్ చేసిందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన తథ్యమన్నారు. ఏపీ ప్రజలు సీఎం జగన్ 59 నెలల సంక్షేమ పాలనను మెచ్చి.. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని, పోలింగ్ జరిగిన తీరుతో తేటతెల్లమైందన్నారు. ఓటమి భయంతో.. టీడీపీ నాయకులు అసహనంతో రాష్ట్రవ్యాప్తంగా కవ్వింపులు, దాడులకు పాల్పడినప్పటికీ. ఓటర్లు బెదరకుండా, ఉదయాన్నుంచే పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరడం, పోలింగ్ సరళిని చూస్తే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4న మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...ఈ ఎన్నికల్లో మంచికి ఓటేయాలని ప్రజలు ముందుగానే నిర్ణయించుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఎక్కడ చూసినా ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు ఉప్పెనలా తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. ఓటింగ్ సరళి, భారీ పోలింగ్ చూస్తుంటే.... సీఎం జగన్ ఇచ్చిన పథకాలకు ఆకర్షితులై.. చివరకు ఎప్పుడూ లేని విధంగా కుప్పంలోనూ 90 శాతం పోలింగ్ జరగడం, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడుతుందనడంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, డాక్టర్.ఏ.వి.సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు ఆనందపార్థసారథి, పోతబోలుఈశ్వరయ్య, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, జన్నే రాజేంద్రనాయునివారు, కోటూరిఈశ్వర్, కోటవారిపల్లె నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం



పెద్దమండ్యం : ఈదురుగాలులతో నేలకూలిన విద్యుత్ స్తంభం



పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోట మెయిన్ రోడ్డులో కూలిన చెట్టు

పెద్దమండ్యం : మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు, పెద్దెత్తున ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెలిగల్లు, వడ్డిపల్లె, సీ గొల్లపల్లె, పెద్దమండ్యం, ముసలికుంట, బండ్రేవు గ్రామాలలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు నేల కూలడంతో అధికారులకు రైతులు సమాచారం అందించారు. విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా కోసం యుద్ధప్రాతిపదికన పనులు చేశారు. ఓ మోస్తరు వర్షం కురవడంతో ఆక్కడక్కడ చిన్న కుంటల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి వర్షం ఉపశమనం కలిగించింది.

అకాల వర్షంతో నష్టం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు రైతులు సాగు చేసిన పంట పొలాలు దెబ్బ తిన్నాయి. పలు చోట్ల విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు సైతం కూకటి వేళ్ళతో నేలకొరిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

తిరుపతిలో జాతర డప్పు దరువు

తిరుపతి కల్చరల్: 'ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది.. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొనసాగుతుంది.. కనుక నగరవాసులెవ్వరూ ఊరు వదలి వెళ్లరాదు.. ఇంతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయకుండా తిరిగి వెళ్లిపోవాలి.. జాతర ప్రారంభమైనందున అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో'... అంటూ మంగళవారం కైకాల వంశస్థులు తిరుపతి గంగజాతర చాటింపు వేశారు. భేరిపీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాంతాల్లో అర్ధరాత్రి అష్టదిగ్బంధన చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ(తిరుపతి గ్రామదేవత) జాతర అత్యంత వేడుకగా ఆరంభమైంది.

ఒడిబాలు సమర్పణ

తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగ జాతర బుధవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. జాతర సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు ఆలయ అవరణలోనున్న అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు చేసి, ఒడిబాలు సమర్పించారు. అలాగే ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వాంగ సుందర అలంకరణలో అమ్మవారు వజ్రకిరీటం, బంగారు ముఖ కవచం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు.

గంగమ్మ నామావళి సీడీ ఆవిష్కరణ

తిరుపతి మంగళం : తిరుపతిలో కొలువై రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించుకుందాని తిరుపతి ఎమ్మెల్యే భూన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ తల్లి నామావళి సీడీని ఆయన ఆవిష్కరించారు. వర్ణ మ్యూజిక్ అకాడమీ సమర్పణలో డాక్టర్ విజయలక్ష్మి రచించి, కోసేరు లక్ష్మిరాజ్యంతో కలిసి గానం చేయగా, ఆర్ కళ్యాణ్‌కుమార్ సంగీతం సమకూర్చారు. గత ఏడాది సినీ గాయకురాలు మంగ్లీతో పాటు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ఆలపించిన గంగమ్మ పాటలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు వచ్చాయి. ఈ ఏడాది కూడా గంగమ్మ పాటలు భక్తులను అలరించేలా రూపొందించినట్లు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తొండమల్ల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. ప్రధానంగా ఆచార్య, ఎంఏ శబ్ద బోధ, ఎంఏ హిందీ, ఎమ్మెస్సీ యోగా థెరపీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రవేశపరీక్ష పాసైన అభ్యర్థులు మాత్రమే పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా రెగ్యులర్ పద్ధతిలో ప్రాక్‌శాస్త్రి కోర్సులో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంగమ్మకు వేడుకగా పుట్టింటి సారె

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి మంగళవారం రాత్రి సాంప్రదాయ పుట్టింటి సారె వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీతాతయ్యగుంట గంగమ్మకు తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి గంగజాతర ముందు వారం అమ్మవారి పుట్టినిల్లు అయిన అవిలాలలో జాతర చాటింపు చేసి గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో జాతర వేడుకలను జరుపుకుంటారు. చివరి రోజు అవిలాలలోని అమ్మవారి పుట్టింటి సారె నడిపే పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి ఇంటి నుంచి ఆడపడుచుకు సాంప్రదాయ బద్ధంగా అందించే పుట్టింటి సారెను అవిలాల పొలిమేరలో వెలసిన గంగమ్మ గుడి వద్దకు మేళతాళాల మధ్య కోలాహలంగా తీసుకొచ్చారు. అమ్మవారి సారెను అందుకునేందుకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓ కె.మమత, సిబ్బంది, జాతరలో వంశపారంపర్యంగా కీలక పాత్ర పోషిస్తున్న కైకాల వంశీయులు అవిలాల పొలిమేరలోని గంగమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టింటి వారి నుంచి అమ్మవారికి సారెను అందుకుని ఊరేగింపుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. సారెను గంగమ్మ గుడి అధికారులు, కైకాల వంశస్తులు స్వీకరించి ఊరేగింపుగా తిరుపతి తాతయ్యగుంట ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సారెతో అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత సాంప్రదాయ బద్ధంగా కై కాల కులస్తులు బేరివీధికి చేరుకుని చాటింపు పూజ చేపట్టారు. అనంతరం నాటి నగర సరిహద్దులలో అష్ట బంధనం చేసి జాతర మొదలయ్యేందహో అంటూ చాటింపు వేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మురళీస్వామి, కైకాల కులస్తులు, అవిలాల గ్రామపెద్దలు పెద్దిరెడ్డి, సురేష్, లోకేష్, చెంగల్రాయులు, వెంకటేష్ పిళ్ళై తనూజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంగ సాగుతో రైతుల్లో నెలకొన్న బెంగ

చిన్నమండెం : రైతులు సాగు చేసిన వంగ పంటతో రైతుల్లో బెంగ నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వండాడి గ్రామం తూర్పుపల్లెకు చెందిన షఫీవుల్లా ఐదు ఎకరాలలో రూ.5 లక్షలు పెట్టుబడితో వంగ పంట సాగు చేశారు. అయితే కూలీ ఖర్చులకు కూడా డబ్బులు రాలేదని రైతు వాపోయాడు. ఉజాలా రకానికి చెందిన వంగ పంటను ఐదు ఎకరాలలో సాగు చేశారు. వంగకు చెన్నై మార్కెట్ కేంద్రంగా మంచి డిమాండ్ ఉండే ఈ పంటను సాగు చేసినా పెట్టిన పెట్టుబడులు సైతం రాకపోగా రైతు దిగులు పెట్టుకున్నాడు. అసలే అప్పులు చేసి సాగు చేసిన పంటతో పెట్టుబడులు రాకపోగా కూలీలకు డబ్బులు పెట్టే స్తోమత లేకుండా తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక పంటను చేనుల్లోనే పారేస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.



వంగ పంట సాగు చేసిన చేనులో రైతు షఫివుల్లా



గిట్టుబాటు ధర లేక పారబోసిన దృశ్యం